క్లుప్తంగా

నల్లబ్యాడ్జీలతో నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థి మృతి ఘటనలో ఆరుగురు ఉద్యోగులు సస్పెండ్ అయిన విషయం విదితమే. ఈ సందర్భంగా శుక్రవారం గురుకులాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రైతుబంధు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతు బంధు డబ్బులను వెంటనే అకౌంట్లలో వేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా రైతులు తమ పంటను అమ్ముకోవడానికి మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి దోపిడీ, దళారుల వ్యవస్థను అరికట్టాలని పేర్కొన్నారు.

సంపద దోచుకున్నారు

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్లుగా ప్రజల సంపదను కేసీఆర్ కుటుంబం దోచుకుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పథకాలను 420గా మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొనడం ఆయన దివాలా కోరుతనానికి నిదర్శనమని అన్నారు. 2014 కు ముందు, ఇప్పుడు ఆస్తులకు మధ్య లెక్క చెప్పాలన్నారు.

మూడు రోజులు 'భగీరథ' నీళ్లు బంద్

గండేడ్: రోడ్డు పనుల్లో భాగంగా గండేడ్ మండలానికి మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీళ్లు రావని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. కొంరెడ్డిపల్లి వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా ఉన్న పైపులైనును మార్చి వేరే చోట వేస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో శని, ఆది, సోమ వారాల్లో గండేడ్ బీపీటీ ఆధ్వర్యంలో ఉన్న గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం సరఫరాను పునరుద్ధరిస్తామని వివరించారు.

పరామర్శ

అడ్డాకుల: నిజాలాపూర్ మాజీ సర్పంచ్ పల్లె మురళీ మాతృమూర్తి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా .. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. శాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ అధ్యక్షుడు శెట్టిశేఖర్, ఎంపీటీసీ గోవర్ధన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మిడ్జిల్: జడ్చర్ల– కల్వకుర్తి ప్రధాన రహదారిపై బోయిన్‌పల్లి స్టేజీ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున లారీని, కారు వెనుకవైపు నుంచి ఢీకొట్టిన ఘటనలో చోటుచేసుకుంది. ఘటనలో కారులో ఉన్న షరీఫ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు కుటుంబసభ్యులు తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సామర్థ్యాలు పెంపొందించాలి

హన్వాడ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని .. అందుకోసం ఉపాధ్యాయులు తగిన విధంగా కృషి చేయాలని ఎంఈఓ రాజునాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా మానసికంగా సిద్ధం చేయాలన్నారు. హన్వాడ మండల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మహమ్మదాబాద్: ఓ యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన ఓ యువతి శుక్రవారం ఉదయం మహబూబ్‌నగర్‌లోని కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరింది. ఉదయం 10 గంటలకు వెళ్లిన ఆమె సాయంత్రం 4 గంటలకు తన మేనత్తకు ఫోన్‌చేసి ప్రేమించిన వ్యక్తి దగ్గరికి హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పింది. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

విద్యార్థులకు వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో రెస్యూమే ప్రిపరేషన్, కెరీర్ గైడెన్స్‌పై సెట్విన్, లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం అని, భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 46 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ భగవంతాచారీ, కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సాధిక్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రుద్రారంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రావు



ఓబ్లాయిపల్లిలో దరఖాస్తుల స్వీకరణ



జిల్లాకేంద్రం 31వ వార్డులో..

దరఖాస్తుదారులకు ఇబ్బంది కలిగించొద్దు



నల్లవల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



జిల్లాకేంద్రంలో..

జడ్చర్ల: ప్రజాపాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తులకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు.శుక్రవారం ఆయన జడ్చర్లలోని 3, 27వ వార్డులోని ఇందిరానగర్, సరస్వతీ కాలనీలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. రిజిస్టర్లు కౌంటర్ల వారీగా పక్కాగా ఉండాలన్నారు. ప్రతి కౌంటర్‌కు ప్రత్యేకంగా రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జెడ్పీసీఈఓ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్, కౌన్సిలర్లు విజయ్, సతీష్, రాజు,రహీమొద్దీన్ పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును సమీక్షిస్తాం

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ప్రతి ఫిర్యాదును సమీక్షించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. ఓబ్లాయిపల్లిలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీఓ నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివరాజ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నాయకులు పాల్గొన్నారు. ఓబ్లాయిపల్లి తండాలో సర్పంచ్ అంజమ్మ, తహసీల్దార్ సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

నవాబుపేట: ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరించి రశీదు ఇవ్వాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సూచించారు. శుక్రవారం రుద్రారంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆఖరి రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని శనివారం సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ అధికారి రమేష్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండలో 21,905 దరఖాస్తులు

కోయిల్‌కొండ: మండల పరిధిలో శుక్రవారం వరకు 39 గ్రామాల్లో 21,905 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఖాజీపూర్, నల్లవల్లి, లింగుపల్లి గ్రామాల్లో కార్యక్రమంలో పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్‌గౌడ్, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని ఏనెమీదితండా, నాగినోనిపల్లి, తిర్మలగిరి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాన్ని ప్రజాపాలన ప్రత్యేకాధికారి, స్పెషల్ కలెక్టర్ జ్యోతి సందర్శించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ దరఖాస్తును స్వీకరించి వారికి సహకరించాలని ఆమె అధికారులకు సూచించారు. ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ కిష్ట్య నాయక్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గండేడ్‌లో 609 దరఖాస్తులు

గండేడ్/మహమ్మదాబాద్: ప్రజాపాలనలో భాగంగా గండేడ్ పరిధిలో 609 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం బల్సూర్‌గొండలో 509 దరఖాస్తులు వచ్చాయి. మహమ్మదాబాద్ మండలంలో మంగంపేట్ తండాలో 403, దేశాయిపల్లిలో 405 దరఖాస్తులు అందాయి. గండేడ్ తహసీల్దార్ నాగలక్ష్మి, మహమ్మదాబాద్ స్పెషల్ ఆఫీసర్ ఛత్రునాయక్, తహసీల్దార్ ఏసయ్య, ఎంపఈఓ పాల్గొన్నారు.

7 రోజుల్లోనే 53,039 దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ప్రజాపాలన'లో భాగంగా ఏడు రోజుల్లో ఇప్పటివరకు 53,039 దరఖాస్తులను పట్టణ పరిధిలో అధికారులు స్వీకరించారు. ఇందులో 'అభయహస్తం'వి 50,261, ఇతర సమస్యలపై 2,778 ఉన్నాయి. శుక్రవారం ఒక్కరోజే మొత్తం 49 వార్డుల నుంచి 3,515 దరఖాస్తులు అందాయి. 31వ వార్డు పరిధిలో 'ప్రజాపాలన'ను మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం, ఏఈ సాయిరాం పరిశీలించారు.

ఆన్‌లైన్‌కు శ్రీకారం

కాగా, ఈ ఏడు రోజుల్లో మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలో వచ్చిన 'అభయహస్తం' దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుకు శుక్రవారం రాత్రి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియను ఈనెల 17వ తేదీలోగా పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో పాలమూరు మున్సిపల్ కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్‌లో సుమారు 20 సిస్టమ్స్ ఏర్పాటుచేశారు. ప్రస్తుతానికి మూడు లాగిన్‌లే రావడంతో ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న దరఖాస్తులను అప్‌లోడ్ చేయడంలో ఆలస్యమవుతుంది. కనీసం 90 లాగిన్‌లు ఇస్తేనే వేగవంతంగా పూర్తి చేయవచ్చని అధికారులు చెబుతున్నారు.



జడ్చర్లలో కలెక్టర్ రవినాయక్



తిరుమల గిరిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



మంగంపేట్‌లో..

అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు



మిడ్జిల్: దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ అన్నారు, శుక్రవారం మండల పరిధిలోని రాణిపేట్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఈనెల 10 వరకు చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ నిరంజన్, నాయకులు తిరుపతి, శేఖర్‌రెడ్డి, వాసుదేవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు తగవు



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి సీఎం అయిన రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని కిషన్‌రెడ్డి అడగడం విడ్డూరంగా ఉందని, గతంలో అనేక సార్లు రాతపూర్వకంగా కేంద్ర మంత్రులకు, ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ కేసీఆర్ మెప్పు కోసం వారి ప్రభుత్వం విచారణకు ఆదేశించలేదని విమర్శించారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీఎస్ సందర్శన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ కళాశాలను పీయూ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈమేరకు కళాశాలలో రోగులకు అందిస్తున్న సేవలు, డాక్టర్ల విధుల వంటి అంశాలపై కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాలెన్న, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారు : యెన్నం



విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల, బాలికల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. రెండేళ్లుగా బీసీ బాలురకు హాస్టల్‌కు రావలసిన రెంట్ కూడా ప్రభుత్వం చెల్లించలేదంటే ప్రభుత్వ విధానాలు, వ్యవస్థ ఏ విధంగా నాశనం అయిందో అర్థమవుతుందన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతుందన్నారు. మంచి వసతులు, అహ్లాదకర వాతావరణంలో హాస్టల్ భవనాలు నిర్మిస్తామని తెలిపారు. హర్షవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి

సీనియర్ సిటిజన్ల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం ఫోరం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. సీనియర్ల అనుభవం గొప్పదని, వారి ఆలోచనలు జిల్లా అభివృద్ధికి అందించాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సహాయం కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఫోరం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జగపతిరావు, నాగభూషణం, నారాయణరావు, రాజేందర్‌రెడ్డి, రాజసింహుడు, బాలయ్య, సురేష్, సిద్ధిరామప్ప పాల్గొన్నారు. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో పండ్ల వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ డీవీఎం బాబునాయక్‌తో ఎమ్మెల్యే చర్చించారు. స్థానిక విజన్ గార్డెన్స్‌లో గ్రామీణ వైద్య సేవకుల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

వేడుకలకు సర్వం సిద్ధం



జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్‌షా దర్గా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సుకు ఘనమైన చరిత్ర ఉంది. సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా మజ్‌జూబ్ ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్. 1929లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిర పడినట్లు ముస్లిం పెద్దలు చెబుతున్నారు. వారి వివరాల ప్రకారం.. ఆయన తన విధులను నిర్వరిస్తూనే దైవ చింతన, ఆధ్యాత్మిక భావనతో ప్రజల్ని చేరదీసేవారని. తన పదవీ విరమణ అనంతరం జిల్లా కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో ఓ చెట్టుకింద కూర్చొని ప్రజలకు హితబోధ చేసేవారు. ప్రతి గురు, శుక్రవారాలు ఖాదర్‌షా వద్దకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి తమ బాధలు, సమస్యల్ని విన్నవించుకునేవారు. కాగా ఆయన పరిష్కార మార్గాలను చెప్పేవారని తెలిసింది. ఖాదర్‌షా మరణానంతరం అతడి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు 1939లో రాయిచూర్ రోడ్డు పక్కన నిర్మించిన ఆయన సమాధిపై ఓ దర్గాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దర్గాను కులమతాలకతీతంగా ప్రజలు దర్శించుకుంటున్నారు.

నేటి నుంచి ఉర్సు

అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సు ఈనెల శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. 6న సాయంత్రం 8 గంటలకు జలాభిషేకం (గుసుల్ షరీఫ్), 7న ఉర్సు వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం నిర్వహించనున్నారు. 8న దీపారాధన, 9న జ్యారత్ ఫాతేహాతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా నిర్వహిస్తాం

వంశపారంపర్యంగా దర్గాలో సేవలు అందిస్తున్నందుకు అదృష్టంగా భావిస్తున్నాం. మా తాత అబ్దుల్‌ఖాదర్ దగ్గర శిష్యుడిగా పనిచేశారు. మేము కూడా దర్గా సేవలో ఉన్నాం. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. ఏర్పాట్లు పూర్తిచేశాం. రెండు రోజులపాటు ఖవ్వాలి ఉంటుంది.

– మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రీ, దర్గా ముతవల్లీ

స్లాట్ బుకింగ్‌కు పాట్లు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివ్యాంగులు కొత్తగా అలాగే రెన్యూవల్ సదరం సర్టిఫికెట్లు పొందేందుకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో శుక్రవారం జిల్లాకేంద్రంలోని మీ- సేవా కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. దివ్యాంగులు, వారి వెంట వచ్చిన వారు బుకింగ్ కోసం అవస్థలు పడ్డారు. శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 9, 23, 30వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) లో సదరం క్యాంప్ నిర్వహించనున్నారు. అలాగే వినికిడి లోపం, మానసిక, కంటిచూపు లోపం కలిగిన వారికి ఈనెల 10, 24, 31వ తేదీల్లో ఈ క్యాంప్‌లు ఉంటాయి. అయితే వీరందరూ ఆయా రోజుల్లో హాజరయ్యేందుకు గాను ముందుగా శుక్రవారం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. దీంతో మీ-సేవా కేంద్రాల వద్ద దివ్యాంగులు, వారి వెంట వచ్చిన వారు బారులు తీరారు. కొందరు ఎలాగోలా స్లాట్ బుక్ చేసుకోగా మరికొందరు వెనుదిరగాల్సి వచ్చింది.

ఇబ్బందులు తొలిగించేలా ప్రణాళికలు

దేవరకద్రరూరల్: పట్టణంలో ప్రజల ఇబ్బందులు తొలిగించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. కొన్ని రోజులుగా స్థానిక బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో విషయంపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం దేవరకద్రలో బస్టాండ్‌ను పరిశీలించారు. అధికారులతో సమావేశం అయ్యారు. సమస్య పరిష్కారానికి అధికారులు ప్రణాళిక రూపొందించి వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆర్‌ఓబీకి సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసి బస్టాండ్ లోపలికి బస్సులు వెళ్లేలా చూడాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు, మండల నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అంజిలిరెడ్డి, వర్మతోపాటు పలువురు ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నచింతకుంట: దమగ్నాపురంలోని నివాసంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిని తపస్ మండల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తపస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నాగరాజు, నాయకులు లక్ష్మీకాంత్, దేవేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మిడ్జిల్: వేములకి చెందిన ఆవుల మల్లేష్(35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి విషయం తెలుపగా బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 5వేలు ఇచ్చారు. అట్టి డబ్బులను స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందించారు. సర్పంచ్ జంగయ్య, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, చెన్నయ్య, పాషా, రాజు, పర్వతాలు తదితరులు ఉన్నారు. అయ్యవారిపల్లిలో కోస్గి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందగా నాయకుడు ప్రదీప్‌రెడ్డి రూ. 3వేల తక్షణసాయం బాధిత కుటుంబానికి అందించారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులిస్తాం



నిజాలాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: అర్హులైన వారికి ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్ కార్డులిస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. నిజాలాపూర్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశారని తెలిపారు. మిగిలిన గ్యారెంటీలను త్వరలోనే అమలు చేస్తారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో గులాబీ కండువా కప్పుకున్న వారికే సంక్షేమ పథకాలను అందించారని విమర్శించారు. సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందిస్తామన్నారు. తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ స్వరూప, సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ గోవర్ధన్, పార్టీ అధ్యక్షుడు శెట్టిశేఖర్, రాంచందర్, నారాయణ, పల్లె మురళీ, రాములు, ఎన్‌టీగౌడ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూమిపై అక్రమార్కుల కన్ను



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో సర్వేనంబర్ 247, 250లో 5.30 ఎకరాల భూమిని 30ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం కేటాయించిందని.. దానినిపై తాజాగా అక్రమార్కుల కన్నుపడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. ఇట్టి భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారని, పలు సందర్భాల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమంగా ఇళ్లను నిర్మించుకున్నా చర్యలు తీసుకోలేదని అన్నారు. అధికారుల సహకారం లేనిదే అక్రమార్కులు ఇలాంటి చర్యలకు పాల్పడుతా అని ప్రశ్నించారు. విషయమై శుక్రవారం అర్బన్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని ఓ ఉద్యోగికి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదరయ్య, నాయకులు కేశవులు, నాగన్న, రాములు, చెన్నయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పదోన్నతులు కల్పించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధ్యాయ పదోన్నతుల కోసం టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి తక్షణమే పదోన్నతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేష్ డిమాండ్ చేశారు. 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం మండల పరిధిలోని ధర్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఒకే క్యాడర్‌లో పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారని, తీరా ఇప్పుడేమో టెట్ అర్హత ఉండాలని అంటున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉపాధ్యాయులను బలి చేయొద్దని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కృష్ణయ్య, వెంకటేశ్వరమ్మ, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.



నవాబుపేటలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



రాచాలలో అక్షతల పంపిణీ

ఘనంగా అక్షతల శోభాయాత్ర

నవాబుపేట: జై శ్రీరాం.. జై శ్రీరాం అంటూ నినాదాల హోరుతో శ్రీరామ అక్షతల శోభాయాత్ర శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షతలు, కాషాయ ధ్వజాలతో భజనలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ నాయకులు, శివాలయం, హనుమాన్ దేవాలయ కమిటీల పాల్గొన్నారు.

అడ్డాకుల: రాచాలలో అయోధ్య రాముడి అక్షతల ఇంటింటి పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్, సునీత్ కుమార్, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, మడిగెల శ్రీనివాసులు, బొక్క శ్రీనివాసులు, భాస్కర్, రంజిత్, రాము, వడ్ల శ్రీనివాసులు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.